సాక్షి
తిరుపతి

శనివారం : 29 ఏప్రిల్ : 2023



బ్రహ్మోత్సవాలకు 120 బస్సులు

రాపూరు: పెంచలకోన బ్రహ్మోత్సవాలకు 120 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రీజనల్ మేనేజర్ శేషయ్య తెలిపారు.

-IIలో



మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

తిరుపతి అర్బన్: జిల్లాలో మే 9 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు.

-IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	37	25
తిరుమల	32	21
గూడూరు	38	27
నగరి	37	26

న్యూస్‌రీల్

మే 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ వి.రమేష్ తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటలకు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. జూన్ 2వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జూన్ 3న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పర్యావరణ విద్యపరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే జూన్ 5 నుంచి 9వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ పేర్కొన్నారు.

గంగమ్మకు కాసుల హారం వితరణ



ఆలయ చైర్మన్, ఈవోకు అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మకు బైరాపట్టిడకు చెందిన పల్లెపాటి రామ్‌దాస్, పల్లెపాటి సువర్ణలతాదేవి బంగారు కాసుల హారం, పగడాల నక్లెస్‌ను శుక్రవారం బహూకరించారు. రూ.8 లక్షల విలువ చేసే ఈ ఆభరణాలను ఆలయ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్యకు అందజేశారు. ఈ హారం, నక్లెస్‌ను శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం గంగమ్మతల్లికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈఓ మాట్లాడుతూ అమ్మవారి గర్భాలయ విమన గోపురంపై ప్రతిష్టించే కలశానికి బంగారు తాపడం పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

వేదం..మహాద్భుతం

'వేదాలు భారతీయుల వారసత్వ సంపద. వీటిలో ఆధ్యాత్మిక జ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం దాగుంది. వీటిలోని సారాంశాన్ని ప్రపంచ వ్యాప్తి చేయాల్సిన అవసరం ఉంది. అందుకు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ, వేద నిష్ణాతులు చేస్తున్న కృషి అభినందనీయం'అని రాష్ట్ర గవర్నర్ కొనియాడారు. శుక్రవారం వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవానికి ఆయన చాన్సలర్ హోదాలో పాల్గొని ప్రసంగించారు.



రామచంద్ర మణి ద్రావిడ శాస్త్రికి మహామహోపాధ్యాయ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న గవర్నర్, ఈఓ



హాజరైన వేద విద్యార్థులు

- ఘనంగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయ 7వ స్నాతకోత్సవం
- కులపతి హోదాలో హాజరైన రాష్ట్ర గవర్నర్
- ఇరువురికి మహామహోపాధ్యాయ, ఇరువురికి వాచస్పతి పురస్కారాలు ప్రదానం
- 539 మందికి డిగ్రీ పట్టాలు అందజేత

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 7వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం స్థానిక మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం కులపతి (చాన్సలర్) హోదాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. వేద యూనివర్సిటీ తరఫున ఇరువురికి మహామహోపాధ్యాయ, మరో ఇద్దరికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. వివిధ కోర్సులు పూర్తిచేసిన 539 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ వేద విద్యార్థులు ధర్మప్రచారం, సత్యనిష్టకు బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలన్నారు.

వేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఎస్వీ వేద విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ వేద విద్యార్థులకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు.

పురస్కారాల ప్రదానం

హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ వీ.సుబ్రహ్మణ్యశాస్త్రి ఘనపాఠి, చెన్నైకి చెందిన బ్రహ్మశ్రీ రామచంద్ర మణి ద్రావిడ శాస్త్రికి మహామహోపాధ్యాయ అత్యున్నత పురస్కారాన్ని, అలాగే అన్నవరానికి చెందిన బ్రహ్మశ్రీ కపిలవాయి రామ సోమయాజీశాస్త్రి, మైసూరుకు చెందిన బ్రహ్మశ్రీ సీ.వంశీకృష్ణ ఘనపాఠిలకు వాచస్పతి పురస్కారాలు అందజేశారు.



బ్రహ్మశ్రీ కపిలవాయి రామ సోమయాజి శాస్త్రి



వంశీకృష్ణ ఘనపాఠికి వాచస్పతి పురస్కారం

డిగ్రీ పట్టాల ప్రదానం

ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో శాస్త్రి, ఆచార్య, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. బ్యాచిలర్స్ డిగ్రీ పట్టాలు 390, మాస్టర్ డిగ్రీ పట్టాలు 125, ఎంఫిల్ పూర్తి చేసిన 8 మందికి విశిష్టాచార్య పట్టా, పీహెచ్‌డీ పూర్తిచేసిన 16 మందికి విద్యావారధి పట్టాలను అందజేశారు. జాతీయ ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆత్మీయ సత్కారం

గవర్నర్, టీటీడీ ఈఓలను ఘనంగా సత్కరించారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి, డీఈఓ భాస్కర్‌రెడ్డి, వేద వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం, ఈసీ సభ్యులు ఆచార్య హరేకృష్ణ శతపతి, డీన్ ఆచార్య ఫణియాజులు, పీఆర్వో ఆచార్య బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

వేద వ్యాప్తికి సహకారం



మాది కర్నూలు జిల్లా, ఆదోని. నా పేరు వెంకటనరసింహ శాస్త్రి. ఆచార్య పూర్తిచేసి గెస్ట్ ఫ్యాకల్టీగా ఆరేళ్లుగా పనిచేస్తున్నా. యజుర్వేదంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టాను అందుకోవడం సంతోషంగా ఉంది. వేదాలను విశ్వవ్యాప్తి చేసేందుకు నా వంతు కృషి చేస్తాను.


సనాతన ధర్మానికి కృషి



నాపేరు శుభంమిశ్ర. మాసొంతూరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, చిత్రకూట్ గ్రామం. అక్కడే ఏడేళ్ల వేదాలు అభ్యసించాను. ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో చదవాలన్నదే నా కోరిక. ఈ నేపథ్యంలో అదర్వేద్‌లో శాస్త్రి, ఆచార్య పూర్తిచేసి డిగ్రీ పట్టాను అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.

నిరంతరాయ విద్యుత్తే లక్ష్యం

- రైతులు ఆడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు
- జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులు భేష్
- పోర్టల్ ద్వారా విద్యుత్ ఫిర్యాదుల నమోదు
- మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన ఏపీఎస్పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వినియోగదారుల సమస్యలకు సంబంధించి సర్కిల్, డివిజన్ స్థాయిల్లో తరచూ సమీక్షలను నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ సంస్థ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అడిగిన వెంటనే కనెక్షన్లు

రైతులు అడిగిన వెంటనే విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇక జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులు భేషుగ్గా ఉన్నాయని మంత్రి ప్రశంసించారు. సంస్థ పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. డిస్కమ్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక వినియోగదారులకు కూడా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని, వినియోగదారులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షనన్ మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు వీలుగా సబ్‌స్టేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగవంతం

ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు మాట్లాడుతూ సంస్థ పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. త్వరితగతిన వ్యవసాయ విద్యుత్తు సర్వీసులను మంజూరు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్తు పొదుపు అంశాలపై వినియోగదారుల అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసే టవర్ల నిర్మాణానికి ఎదురయ్యే ఆటంకాలు పరిష్కారమవుతున్నట్టు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి పోర్టల్

గ్రామ, వార్డు సచివాలయాల్లో పోర్టల్ ద్వారా విద్యుత్ సమస్యలను నమోదు చేసే ప్రక్రియను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, ఎన్‌వీఎస్. సుబ్బరాజు, కె.శివప్రసాదరెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డీఎస్.వరకుమార్, వై.లక్ష్మినరసయ్య, డీవీ చలపతి. పి.ఆయూబ్‌ఖాన్. కె.గురవయ్య, కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని, ఓఎస్ డీఎన్. శ్రీనివాసులు, ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ రమణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,910 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 27,838 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.80 లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆరోగ్య భరోసా

ఎమ్మెల్యేకి రుణపడి ఉంటా



■ మాది ఐరాల మండలం, చంద్రాగారి పల్లె. నా పేరు ఎం. అనూష, ఆస్తమాతో బాధపడుతున్నా. దామలచెరువులో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌కు నా తల్లితో కలిసి వచ్చా. అక్కడే ఉన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి సర్‌ని కలిశా. ఆయన ఆప్యాయంగా దగ్గరకు దతీసుకుని సమస్య అడిగితెలుసుకున్నారు. ఏదైనా సాయం కావాలా..? అని ఆత్మీయంగా అడిగారు. వెంటనే రూ.10వేలు అందించారు. జబ్బు నయంకావడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే సర్‌కి రుణపడి ఉంటా.

మూడో రోజూ కొనసాగిన మెడికల్ క్యాంప్
- దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి
- ఆస్తమా పేషెంట్‌కు రూ.10 వేలు అందజేత

పాకాల: నియోజకవర్గంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ దిగ్విజయంగా కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఉదయం 6.30 నుంచి చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



ఈసీజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

అధికారుల సేవలు అభినందనీయం

మెడికెల్ క్యాంప్‌లో జిల్లా, తుడా అధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఉచిత వైద్య పరీక్షా కేంద్రానికి విచ్చేసే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారికి కావాల్సిన వివరాలు అందజేస్తూ.. వైద్యపరీక్షలు చేయిస్తున్నారని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం భోజన కేంద్రం వద్దకు తీసుకెళ్లి భోజనం పెట్టి సురక్షితంగా ఇళ్లకు పంపుతున్నారని చెప్పారు.



వివరాలను తెలుపుతున్న డాక్టర్లు

సర్వత్రా హర్షం

ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గ్రామాల్లోకే ఆటోలు వెళ్లి నడవలేని వారిని మెడికల్ క్యాంప్‌కు తీసుకొస్తునానరు. ఆపై వైద్యపరీక్షల అనంతరం మళ్లీవారిని సురక్షితంగా ఇళ్ల వద్ద దింపడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని, ఆయన బాటలోనే నాయకులు కూడా నడవడం చాలా సంతోషకరమని సీనియర్ సిటిజన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బంగారం:

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,990
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,537
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,300
రిటైల్ వెండి గ్రాము	రూ.78.30

మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేర్చాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మే 9వ తేదీన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు 1902 హెల్ప్ లైన్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. విద్యార్థులకు, టీచర్లకు ఇచ్చిన బైజూస్ ట్యాబ్‌లు మేలో ఒకసారి డిజిటల్ అసిస్టెంట్ పాఠశాలను సందర్శించి వాటి వాడకంపై అవగాహన కల్పించాలని చెప్పారు. జగనన్న విద్యా కానుకకు సంబంధించిన వస్తువులలో పుస్తకాలు, బ్యాగులు, డిక్షనరీలు, షూ, టై, బెల్టు యూనిఫారం తదితర వాటిని పాఠశాలల పునః ప్రారంభం నాటికి పిల్లలందరికీ అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలనానరు. ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్ పోస్టులను నిబంధనల మేరకు ఈనెల 29 నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాసరావు, డీఈఓ శేఖర్, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, ఏడీ సర్వే జయరాజ్, డీఎల్ డీవోలు సుశీలాదేవి, ఆదిశేషరెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యం

తిరుపతి అర్బన్: ప్రయాణికుల సౌకర్యాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో జిల్లాలోని 11 ఆర్టీసీ డిపో మేనేజర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బస్టాండ్లలో ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత, ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించడం తదితర అంశాలపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

రాబడిపై సుదీర్ఘ చర్చ

ఆర్టీసీ రాబడిపై డిపో మేనేజర్లతో డీపీటీఓ సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టీసీ ఆదాయంలో జిల్లా 2022–23కు సంబంధించి రూ.565 కోట్లు, 12.08 కోట్ల కిలోమీటర్లు, ఈపీకే 46.76 (కిలోమీటర్‌కు ఆదాయం) ఓఆర్ 65 (సరాసరిగా సర్వీస్‌ల్లో 65శాతం సీట్ల భర్తీ) వచ్చిందన్నారు. దీంతో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.677.84కోట్ల రాబడి, 13.11కోట్ల కిమీటర్లు సర్వీసులు తిప్పాలని, ఈపీకే రూ.51.68, ఓఆర్ 71 సాధించాలని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

రాబడిలో ప్రథమ స్థానంలో తిరుమల, చివరి స్థానంలో సూళ్లూరుపేట

ఆర్టీసీ రాబడిలో తిరుమల డిపో ప్రథమ స్థానంలో సూళ్లూరుపేట డిపో చివరి స్థానంలో నిలిచిందన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ జి.నరసింహులు, పర్సనల్ ఆఫీసర్ ఎం.పార్థసారథి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, 11 డిపోల మేనేజర్లు, అకౌంట్స్ ఆఫీసర్ చంద్రమణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పాకాల: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గురువారం రాత్రి దామలచెరువు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం పుల్లావాండ్లపల్లికి చెందిన ఏ.మునిద్దులను(63)ని ఢీకొంది. క్షతగాత్రున్ని పులిచెర్ల ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి చిన్నారి..

తడ: ప్రమాద వశాత్తు నీళ్ల కుంటలో పడి చేనిగుంట గిరిజన కాలనీకి చెందిన తుపాకుల మోనిత(4) శుక్రవారం మృతి చెందింది. వివరాలు.. తల్లిదండ్రులు మురళి, నాగమ్మ ప్రైవేటు పరిశ్రమలో పనికి వెళ్లడంతో నానమ్మ రూప వద్ద చిన్నారి ఆడుకుంటోంది. ఈ క్రమంలో తోటి పిల్లలతో కలిసి గ్రామంలోని నీటి కుంట వద్దకెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. కొంత సమయం తర్వాత బాలిక మృతదేహం పైకి తేలింది. తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదం దృశ్యం

రేణిగుంట: రేణిగుంట–శ్రీకాళహస్తి మార్గం గుత్తివారిపల్లె సమీపంలోని ఓ డాబాకు చేరువలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. ఏర్పేడుకు చెందిన కన్నయ్య, ఉమ ఒక్కగానొక్క కుమారుడు గాండ్ల బాబూజీ. పదేళ్ల కిందట బాబూజీ తల్లి ఉమ మృతి చెందడంతో అతని తండ్రి కన్నయ్య మరో వివాహం చేసుకున్నాడు. దీంతో బాబూజీ ఏర్పేడు మండలం, పాతవీరాపురానికి చెందిన తన తాత గోవిందస్వామి దగ్గరే ఉంటున్నాడు. బాబూజీ(22) రెండు నెలలుగా రేణిగుంట సమీపంలోని ఓ కంపెనీలో పనికి వెళుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పాతవీరాపురం నుంచి బైక్‌పై బయల్దేరి వెళుతుండగా మల్లవరం దాటాక, ఓ ప్రైవేటు దాబా సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు బలమైన రక్తగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాళ్లదాడి నిందితులు చవటపాలెం వాసులు

గూడూరు: వందే భారత్ రైలుపై రాళ్లతో దాడిచేసిన వారు పట్టణ సమీపంలోని చవటపాళెం వాసులుగా తెలిసింది. వందే భారత్ రైలుపై గురువారం ఇద్దరు వ్యక్తులు రాళ్లతో దాడికి పాల్పడడం, వారిని ఆర్‌పీఎఫ్‌కు అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇలా రాళ్లదాడికి పాల్పడిన వారు చడటపాళెంకు చెందిన వినోద్, వెంకటేశ్వర్లుగా గుర్తించారు. వారు ఆకతాయిగా చేశారా..అలా చేయడం వెనుక ఏదైనా ఉద్దేశం ఉందా అన్నది విచారణలో తెలాల్సి ఉంది.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు 120 బస్సులు



రాపూరు ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న ఆర్ఎం ఆదిశేషయ్య

రాపూరు: మడలంలోని పెంచలకోనలో మే 1 నుంచి 7వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు 120 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శేషయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన రాపూరు ఆర్టీసీ డిపోను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెంచలకోన శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు నెల్లూరు డివిజన్ నుంచి 85, వైఎస్సార్ జిల్లా నుంచి 35 బస్సులను నడపనున్నట్టు చెప్పారు. ఇవికాకుండా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడుపుతామన్నారు. ఆయన వెంట డిపో మేనేజర్ అనిల్‌కుమార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాము తదితరులు ఉన్నారు.

జార్ఖండ్ వాసి ఆత్మహత్య

నాయుడుపేటటౌన్: అనారోగ్య బాధ తాళలేక క్యాంటిన్‌లో మాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేనకూరు సెజ్‌లోని హిందుస్థాన్ గ్లాస్ పరిశ్రమ క్యాంటీన్‌లో శుక్రవారం జరిగింది. నాయుడుపేట అర్బన్ సీఐ నరసింహారావు కథనం మేరకు.. మేనకూరు సెజ్‌లోని హిందుస్థాన్ గ్లాస్ పరిశ్రమ క్యాంటీన్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దిలీప్ పాశ్వన్(27) రెండేళ్లుగా మాస్టర్‌గా పనిచేసున్నాడు. ఇతనికి భార్య, ఒక బాబు ఉన్నారు. అతని కుటుంబ సభ్యులు జార్ఖండ్‌లోనే ఉంటున్నారు. కొంత కాలంగా దిలీప్ పాశ్వన్ ఆరోగ్యం సరిలేక వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో దిలీప్ పాశ్వన్ క్యాంటీన్ మిద్దెపైకి వెళ్లి నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. గుర్తించిన యాజమాన్య ప్రతినిధులు పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ నరసింహారావు, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు సంఘటన స్థలానికి చేరకుని పరిశీలించారు. అనారోగ్యంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నానని అందు వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లెటర్ రాసి మృతుడు జేబులో పెట్టుకుని ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.